కథ

# గిలకబావి

-రావి- ఎస్- అవధాని

''పూరాగా దోసుకుపోనారండీ!''

''ఆరుబారల కయివోరవండి! పది నిలువుల నోతండి! చిమ్మింటు సపటా! మొలబంటెత్తు సుట్టుగోడ!''

''సెరుకురసం నాగ తియ్యటి గంగ! గిలక బావి!''

''బావిల వేనుగు తొండవంత నావు జల ఊట! అట్టాటి దాన్ని ఎవురో పూరాగా దోసుకు పోనారు''

''పుంజిడు మడి సెక్కలూ బద్దరంగున్నాయి. ఆటి ముంగిట్ల నాపూరిగుడిస కూలిపోయి అట్టాగే వుంది. దాని దాపలేపున గిలక బావి అవుపడత నేదండి!''

''మండేసవిల నాలుగు నిలువుల గంగుండేది. నాగిలక బావి గంగ తాగ నోరు మనగేయంల నేరండి!''

''నా ఆదారం పోనాది! తవరు దరమ పెబువులు, నాగిలక బావి ఏటవినాదో ఇసారన సెయ్యాల!'' అని పంచాయతీ పెద్దలకు విన్నవించుకున్నాడు కూరాకుల వెంకడు.

''వెంకడు చెప్పిన మాటలన్నీ నిజమే అయినా వాడికి ఏమని తీర్పు చెప్పాలో పంచాయతీ పెద్దలకు తెలియలేదు.

చింతపల్లి, నడిపల్లి, మరిపల్లి, మూడు గ్రామాలూ పొయ్యి పొక్కిళ్లలా కూతవేటు దూరంలో వున్నాయి. చింతపల్లి ఆరొందల గడప అగ్రహారం. కామయ్య పంతులుగారికి చింతపల్లిలోనే గాక మిగిలిన రెండు గ్రామాల్లోనూ పంట పొలాలు, తోటలున్నాయి.

ఆ మూడు గ్రామ ప్రజలకూ ఆయన మాట వేదవాక్కు. ఏ తగవువచ్చినా ఆయనే తీర్పు చెప్పాలి. ఆయన తీర్పుకు అంతా కట్టుబడి ఉండేవారు.

కామయ్య పంతులుగారు కాలం చేసిన తరువాత ఆ మూడు గ్రామాల సర్పంచులూ తమ గ్రామాల్లోని కుల పెద్దలను ఎంపిక చేసి వారిని పంచాయతీ పెద్దలుగా నిర్ణయించి వారి తీర్పుకు కట్టుబడి ఉండే విధంగా తీర్మానించుకున్నారు.

కూరాకుల కురమయ్య కొడుకు వెంకడు. కురమయ్యకు చింతపల్లి గ్రామాన్ని ఆనుకొని ఎకరం పొలం ఉంది. పొలంగట్టున చిన్న పూరి గుడిసె దాని పక్కనే పెద్ద గిలక బావి ఉన్నాయి.

కురమయ్య తన పొలంలో రకరకాల కాయకూరలు, ఆకుకూరలు పండించేవాడు. వాటి రాబడితో జీవనం సాగించేవాడు. ఊర్లంట తిరిగి కాయకూరలు అమ్ముకునేవారు నిత్యం వచ్చి అతని వద్ద తాజా కాయకూరలు ఆకుకూరలు కొనుక్కొని పోయేవారు.

మండు వేసవిలో కూడా కురమయ్య గిలక బావిలో పుష్కలంగా నీరుంటుంది. బావిలో నీరు తియ్యగుంటుంది. ఎండాకాలంలో గ్రామంలో చెరువులు, బావులు ఎండిపోయేవి. గ్రామవాసులంతా ఆ గిలకబావి నీరు తీసుకొని పోయేవారు. కురమయ్య వారిని అభ్యంతరం చేసేవాడు కాదు.

వెంకడి చిన్న వయసులో అతడి తల్లి చనిపోయింది. కురమయ్య మళ్లీ పెళ్లి చేసుకోలేదు. వెంకడ్ని ముద్దుగా పెంచాడు. వెంకడు అమాయకుడు. గ్రామంలోని ఎలిమెంటరీ స్కూల్లో ఐదవ తరగతి వరకూ చదువుకున్నాడు. తండ్రికి కాయకూరలు పండించడంలో సాయపడేవాడు.

తండ్రి చనిపోయిన తరువాత వెంకడికి కష్టాలు మొదలయ్యాయి. కాయకూరల మొక్కలకు చీడ పీడలు సోకి చనిపోయాయి. ఎంత ప్రయత్నించినా దిగుబడి రావటం లేదు. సరుకు తీసుకొని వెళ్లినవారు సొమ్ములివ్వటం లేదు. వారిని నిలదీసి సొమ్ము వసూలు చేసుకునే చొరవ లేదు వెంకడికి. ఇక కాయకూరల సాగు కలిసిరాదని దానిని విడిచి పెట్టి కూలిపనులు చేసుకుంటూ పొట్టపోషించుకుంటున్నాడు.

రెండు సంవత్సరాలు వర్షాలు కురవక పంటలు పండలేదు. కరువొచ్చింది. కూలి జనాలకు రోజు గడవడం లేదు. బ్రతుకు తెరువు కోసం వారందరూ గ్రామాలు వదలి పట్టణాలకు వలసపోయారు. వారితోపాటు వెంకడు కూడా గౌరీపట్నం పోయాడు.

వెంకడి అదృష్టం బాగుండి వాడికి గౌరీపట్నం మినరల్ వాటర్ కంపెనీలో పనిదొరికి రెండు పూటలా కడుపునిండా తిండి, తలదాచుకునే చోటు దొరికింది. వెంకడు చాలా నమ్మకస్తుడు, కష్టపడి పనిచేస్తాడనే పేరు సంపాదించుకొన్నాడు. యజమాని అభిమానం పొందాడు.

నాలుగు సంవత్సరాలు యిట్టే గడచిపోయాయి. పట్నంలో నీటి ఎద్దడి వచ్చింది. కంపెనీ ఆవరణలో బోర్లు ఎండిపోయాయి. టాంకర్లతో నీరు సరిగా అందడం లేదు. ఖర్చు ఎక్కువై గిట్టుబాటవడం లేదు. కంపెనీ మూతపడే పరిస్థితి వచ్చింది.

ఆ తరుణంలో వెంకడికి చక్కటి ఆలోచన వచ్చింది. కంపెనీ యజమానిని కలిసి

''అయ్యా! మా గ్రామంలో నాకు ఎకరం పొలం వుంది. అందులో పెద్ద గిలక బావి ఉంది. వేసవిలో కూడా ఎండిపోదు. తియ్యటి గంగ! ఆ గిలక బావిలో పెద్ద జల ఊట ఉంది. ఎంత నీరు తోడినా, మర్నాటికి అది నిండుతుంది. ఆ బావి నీరు మనం అవసరాలకు వాడుకుంటే బావుంటుంది'' అన్నాడు.

కంపెనీ యజమాని వాడి మాటలు గౌరవించి వాడి వెంట ఒక సూపర్వైజర్ని, కెమిస్ట్ని పంపి నీటిని పరీక్షించి శాంపిల్స్ తీసుకొని రమ్మనమని చెప్పాడు.

వెంకడు నాలుగేళ్ళ తరువాత గ్రామంలో అడుగుపెట్టాడు. గ్రామం రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. ఊరంతా తీర్చిదిద్దినట్లు పక్కాగృహాలు, సిమ్మెంటురోడ్లు, మురుగునీరు పోవడానికి కాలువలు, చెత్త చెదారం లేక పరిశుభ్రంగా ఉంది.

వెంకడు తన పొలంలో అడుగుపెట్టగానే మూర్ఛపోయాడు. పొలంలో పిచ్చి మొక్కలు లేచాయి. పూరిగుడిసె నేల మట్టమయింది. గిలకబావి కనిపించలేదు. పొలమంతా కలయ తిరిగి లబోదిబో మన్నాడు.

గ్రామంలో కనిపించిన వారినందర్నీ అడిగాడు. అందరూ వాడిని పిచ్చివాడిని చూసినట్లు చూసి హేళన చేశారు. కొందరు జాలిపడి గ్రామ సర్పంచికి చెప్పి పంచాయతీ పెట్టించమని సలహా యిచ్చారు.


వెంకడు గ్రామ సర్పంచిని కలిసి తన గోడు విన్నవించుకున్నాడు. వాడి నస భరించలేక గ్రామపెద్దల్ని పిలిపించి పంచాయతీ పెట్టిం

చాడు.

గ్రామ పెద్దలు వెంకడి పొలం దస్తావేజు కాగితాలు చూసి కొలతల ప్రకారం సరిహద్దు సర్వే రాళ్ళను చూపించి చేతులు దులుపుకున్నారు. గిలకబావితో తమకు సంబంధం లేదని చెప్పారు.

వెంకడికి ఏం చెయ్యాలో తెలియలేదు. పిచ్చివాడిలా తిరుగుతుంటే గ్రామం పొలిమేరలో ఒక కారు వచ్చి వాడి ముందు ఆగింది. అందులోంచి దిగిన వ్యక్తి-

''ఏం వెంకన్నా! బాగున్నావా?'' అని నవ్వుతూ పలకరించాడు.



వెంకడు ఆ వ్యక్తి వంక ఆశ్చర్యంగా చూశాడు.

''దండాలు బాబూ! చమించాల! తవర్ని పోల్తి పట్టనేదు'' అన్నాడు వినయంగా చేతులు జోడించి.

''నేనురా! సూర్యంని..కామయ్యగారి''

''తవరా బాబూ! ఎంతపనైపోనాది! శాన్నాల్లయింది తవర్ని సూసి! అంతా బావున్నారా! బుగతమ్మ గోరూ? అయిదరాబాదు నుండొత్తన్నారా? పుస్కరం దాటి పోనాది తవరందర్నీ సూసి'' అన్నాడు.

సూర్యం, వెంకడు చిన్ననాటి స్నేహితులు. గ్రామంలోని ఎలిమెంటరీ స్కూల్లో ఇద్దరూ కలసి ఐదవ తరగతి వరకూ చదువుకున్నారు. తరువాత సూర్యం పైచదువులకు మేనమామ ఇంటికి హైదరాబాద్ వెళ్ళిపోయాడు. ఐ.పి.యస్.చదివి పోలీసు ఆఫీసరయ్యాడు. పండుగలకు శలవులకు గ్రామం వచ్చినప్పుడు వెంకడ్ని కలిసేవాడు.

కామయ్యగారి భార్య అన్నపూర్ణమ్మగారు వెంకడ్ని ఎంతో అభిమానంగా చూసేవారు. తన కొడుకు సూర్యంతోపాటు వాడికీ కొత్తబట్టలు కొనేవారు. వెంకడి భోజనం తరుచు వారింటి వద్దనే. కురమయ్య రోజూ తాజాకాయకూరలు తన కొడుకు చేత వారికి పంపేవాడు. డబ్బులిస్తే పుచ్చుకునేవాడు కాదు.

కామయ్య పంతులుగారి ఏకైక కుమారుడు సూర్యం చదువుల నిమిత్తం దూరం కావడం వల్ల వెంకడు అన్నపూర్ణమ్మగారికి బాగా చేరువయ్యాడు.

సూర్యం ఇంటరు చదువుతుండగా కామయ్యగారు చనిపోయారు. సూర్యం మేనమామ వచ్చి గ్రామాల్లోని పొలాలు అమ్మివేసి అన్నపూర్ణమ్మగారిని కూడా హైదరాబాద్ తీసుకొని వెళ్ళాడు.

పన్నెండు సంవత్సరాల తరువాత వెంకడు సూర్యాన్ని కలుసుకున్నాడు. సూర్యం రూపురేఖలు ఒడ్డు, పొడవు మారిపోయాయి. మనిషిలో హుందాతనం ఉట్టిపడుతోంది. అందువల్లే వెంకడు అతన్ని గుర్తుపట్టలేకపోయాడు.

''అదేం కాదురా! నాకు హైదరాబాద్ నుండి గౌరీపట్నం ట్రాన్స్‌ఫరైంది. నెలరోజులైంది'' అని తన చదువు ఉద్యోగం గురించి చెప్పాడు.

''అమ్మ నిన్ను చూడాలంటోంది. నిన్ను తీసుకొని వెళ్దామనే వచ్చాను'' అన్నాడు.

సూర్యం మాటలకి వెంకడి కళ్లు చెమర్చాయి.

''బుగతమ్మగారికి నాను గుర్తున్నానా బాబూ!'' అన్నాడు.

''అదేంమాటరా! అమ్మ ఎప్పుడూ నీ గురించే చెప్తుంది. అవునూ నువ్వేంటిలా వున్నావ్? ఒంట్లో బాగులేదా?'' అని అడిగాడు.

వెంకడు జరిగిందంతా చెప్పాడు.

''మీ నాన్న చనిపోవడం, నువ్వు ఇన్ని ఇబ్బందులుపడి కష్టాలపాలవడం నాకు యీ విషయాలేవీ తెలియలేదు. నా ఎడ్రస్ నీకిచ్చాను కదా ఉత్తరం ఎందుకు రాయలేదు?''

''తవరి సిరునావా సీటీ మా అయ్య సేతికిచ్చి దాయమన్నాను. మా అయ్య పోయినాక నెలికినా. దొరక నేదు బాబూ''

''సరే పద! నీ పొలం చూద్దాం!'' అని వాడి వెంట నడి

చాడు.

వెంకడి పొలానికి తూర్పువేపు సరిహద్దుని అనుకొని ఉన్న ఎత్తైన ప్రహరీగోడ చూసి ''ఇది ఎవరిది'' అని అడిగాడు సూర్యం.

ఆ ప్రహరీగోడ గ్రామ సర్పంచి అల్లుడుగారి దని తెలుసుకున్నాడు. పొలమంతా పరీక్షగా చూశాడు. పొలంలో బావి ఉన్న ఆనవాలు లేదు.

''నీ బావి ప్రక్కన నామాల బండ ఉండేది కదూ?'' అన్నాడు.

''అవును బాబూ! నాకిప్పుడు యాదకొత్తోంది! దానిమీద గదా మనం సిన్నప్పుడు కూకొని ఊసులాడత కందిబొట్టలు దినే వోరం! సిత్తరం! నామాల బండ కూడా ఎత్తుకుపోనారు బావూ'' అన్నాడు బిగ్గరగా.

వెంకడి పొలంలో గిలకబావి చప్టా ప్రక్కనే మూడు అడుగుల ఎత్తున్న చిన్న బండరాయి దానిమీద తెల్లటి చారలు ఉండేవి. దానిని నామాల బండని పిలిచేవారు. ఆ బండ భూమిలో చాలా లోతు వరకూ ఉంది. దాని వల్లే గిలక బావిలో అంత పెద్ద ఊట జలపడిందని కురమయ్య అనేవాడు.

సూర్యంకి విషయమంతా అర్థమయింది. 'పట్టణాలలోనేగాక పల్లెలలోనూ కబ్జా జాడ్యం వ్యాపించింది' అనుకున్నాడు.

''వెంకన్నా! నీ గిలక బావి నామాల బండ ఎక్కడికీ పోవు. వాటిని నేను నీకు భద్రంగా ఇప్పిస్తాను. నువ్వేమీ వర్రీ అవకు! పద మనం ఇంటికి వెళ్లి ఆలోచిద్దాం'' అని వెంకడ్ని తీసుకొని పట్నం బయలుదేరాడు సూర్యం.

సూర్యం మాటలకు వెంకడు పరమానందం చెందాడు. తన గిలకబావి దొరికినంత సంతోషించాడు.

అన్నపూర్ణమ్మగారు వెంకడ్ని చూసి ఎంతో సంతోషించారు. వాడు ఆవిడ పాదాల మీద పడి కంట తడి పెట్టుకున్నాడు. ఆవిడ కోడల్ని పిలిచి వెంకడ్ని పరిచయం చేసింది. ఎంతో ఉత్సాహంగా వాడిగురించి కోడలికి చెప్పింది.

అన్నపూర్ణమ్మగారు తన తమ్ముడి కూతురు అవంతిని కోడలిగా చేసుకొంది. అవంతి తన పెళ్ళయిన తరువాత అత్తగారిలో అంత సంతోషం ఏనాడూ చూడలేదు.

వెంకడికి భోజనం అన్నపూర్ణమ్మగారే దగ్గరుండి కొసరి కొసరి వడ్డించారు.

వెంకడు రాత్రి చాలా పొద్దుపోయే వరకూ అన్నపూర్ణమ్మగారితో కబుర్లు చెప్పి ఊరట చెందాడు.

మర్నాడుదయం సూర్యం సి.ఐ. ముకుందానికి ఫోన్ చేసి ఇంటికి రమ్మనమని అతను వచ్చాక వెంకడి విషయమంతా చెప్పాడు.

''మీరేం వర్రీ అవకండి సార్! వాళ్ళను నేను టాకిల్ చేస్తాను. వాళ్ళ చేత నిజం కక్కిస్తాను'' అని సెల్యూట్ చేసి వెళ్లిపోయాడు.

ముకుందం ఇద్దరు జవాన్లను వెంట తీసుకుని చింతపల్లి గ్రామానికి వెళ్ళాడు. సర్పంచి అల్లుడి ఇంటి ఆవరణ పరిశీలించాడు. గిలక బావి, దాని చప్టా ప్రక్కనే నామాల బండ వాటిని ఆనుకొనే ప్రహారీ గోడ నిర్మించబడటం గమనించాడు. అల్లుడు మామలిద్దరినీ జీపు ఎక్కించి పట్నం తీసుకొచ్చి పోలీసు లాకప్‌లో పెట్టి నాలుగు దెబ్బలు వేసేసరికి వారు నేరం అంగీకరించారు.

వెంకడి పొలంలో వాడి పూరిగుడిసెను నేలమట్టం చేసి వాడి గిలకబావి వరకూ ఉన్న జాగాను కబ్జాచేసి తన ఇంటి ఆవరణలో కలుపుకుని ముదరాగా అవతల తన పొలంలో అంతే జాగాలో సరిహద్దు సర్వే రాళ్లను మార్చినట్లు ఒప్పుకొని లిఖిత పూర్వకంగా ఇచ్చాడు సర్పంచి అల్లుడు. మర్నాడుదయానికి ప్రహరీగోడ కొట్టించివేసి వాడి గిలక బావి, పొలంలో కబ్జా చేసింది పూర్వపుస్థితిలో అప్పగిస్తానని రాత పూర్వకంగా యిచ్చి బయట పడ్డారు అల్లుడు మామలు.

వారు చెప్పిన విధంగానే చేశారు.

గౌరీపట్నం మినరల్ వాటర్ కంపెనీవారు వెంకడి పొలం, గిలక బావి, దానిలోని వాటర్ కెపాసిటీ పరిశీలించి అక్కడ తమ ప్లాంట్ నిర్మించాలనుకున్నారు.

వెంకడ్ని ప్రలోభపెట్టి వాడి పొలం, బావి చేజిక్కించుకోవాలని ప్లాను వేశారు.

సూర్యం వారి ఆటలు సాగనియ్యలేదు. పొలం లీజుకిగాక అమ్మకానికే పెట్టి, గిలక బావి పొలం పది లక్షలకు అమ్మించి బాల్యమిత్రుడ్ని ఆదుకున్నాడు.

☆

## డేరింగ్ గాళ్ నయనతార

**తమిళంలో యువహీరోల్లో శింబుకి పోటీ అనిపించుకుంటున్న హీరో ధనుష్. రజనీకాంత్‌కి అల్లుడైనప్పటి నుంచీ ధనుష్ కెరీర్ మరో మలుపు తిరిగిందని చెప్పవచ్చు. శింబుతో గొడవలొచ్చి అతనికి దూరమైన నయనతార ఇప్పుడు ధనుష్‌తో ఓ సినిమాలో హీరోయిన్‌గా నటించడానికి అంగీకరించి శింబుతో పాటు కోలీవుడ్ జనాల్ని ఆశ్చర్యంలో పడేసింది. శింబుకి పోటీ అనదగ్గ హీరోతో నయనతార నటించడానికి రెడీ కావడం అతన్ని సవాలు చేస్తున్నట్టే కదా! అని ముక్కున వేలేసుకుంటున్నారు సినీజనాలు. మొత్తానికి నయనతార డేరింగ్ గాళే!**

